వేప చెట్లు నరికిన వ్యక్తిపై కేసు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 26: వేపచెట్లు నరికిన వ్యక్తిపై కేసు నమోదైన ఘటన సోమవారం శంషాబాద్ రూరల్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం, కాచారంలోని హనుమాన్ ఆలయం ఆవరణలో ఉన్న నాలుగు వేప చెట్లను ఉస్మాన్‌ఖాన్ నరికివేశాడు. గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేయగా అతడిపై 447, 427 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'పోయిన ఫోన్ దొరికింది'

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 26: సీఈఐఆర్ పోర్టల్ సాయంతో పోయిన ఫోన్‌ను బాధితుడికి అప్పగించిన ఘటన సోమవారం శంషాబాద్ రూరల్ పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన ప్రకారం, నానాజీపూర్‌నకు చెందిన ఆటోడ్రైవర్ శ్రీనివాస్ 30వేల వీవో 29 ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, సీఐ శ్రీనాథ్ ఆదేశాలతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అందజేశామని ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ లింగమూర్తి ఉన్నారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్టు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 26: సెల్‌ఫోన్‌ను అపహరించిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం, అమీర్‌పేటలోని హోటల్ అరిటాకులో ఓ వినియోగదారుడి సెల్‌ఫోన్ 23న చోరీకి గురైంది. హోటల్ యజమాని పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు నవీన్ కుమార్‌ను అరెస్టు చేశారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా..

- సర్వే పూర్తిచేసి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న అధికారులు..
- సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై నేటి నుంచి అధికారుల క్షేత్రస్థాయి పర్యటనలు

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 26: రానున్న వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు సమ్మర్ యాక్షన్ ప్లాన్‌తో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోనున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఇప్పటికే సర్వే పూర్తి చేసి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నేటి నుంచి క్షేత్రస్థాయిలో సెక్షన్ మేనేజర్లు పర్యటించి నీటి సరఫరాలో సమస్యలపై నివేదికలు సిద్ధం చేస్తారని జల మండలి డివిజన్-6 జీఎం ఎస్.హరిశంకర్ తెలిపారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో సోమవారం పర్యటించి నీటి సరఫరాను తీరును పరిశీలించారు. ఇప్పటికే ప్రత్యేక బృందాలు పర్యటించి సర్వే పూర్తిచేసి నివేదికలు ఇచ్చినట్లు తెలిపారు.

ఇందులో భాగంగా మరమ్మతు, మెయింటెనెన్స్ పనులను వేగవంతంగా పూర్తిచేసి వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా సెక్షన్ల పరిధిలో పవర్ బోర్‌వెల్స్, హ్యాండ్ బోర్‌వెల్స్ ఎలక్ట్రిక్ సబ్‌స్టేషన్లు, పంపింగ్ స్టేషన్లలో స్టాండ్ బై ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అత్యవసర స్థితిలో చేపడుతున్న ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో వేసవిలో తాగునీటి సరఫరాకు ఆటంకం కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 66 పవర్ బోర్‌వెల్స్‌లో 13 బోర్‌వెల్స్‌కు మరమ్మతు పనులు చేపడుతున్నామని తెలిపారు. వేసవిలో ప్రజలకు నీటి సరఫరాలో అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

నీటి ప్రెషర్‌ను పరిశీలిస్తున్న జల మండలి జీఎం హరిశంకర్

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

ఫిలింనగర్‌లోని వివేకానంద గ్రామర్ స్కూల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు వివిధ అంశాలపై వినూత్న నమూనాలు రూపొందించి తమలోని సృజనాత్మకతను చాటుకున్నారు. నీటి పారుదల, శరీర అవయవాలు, ఇస్రో, కాలుష్యం తదితర అంశాలపై రూపొందించిన నమూనాలు వీక్షకులను ఆలోచింపజేసి, ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యా శాఖ డిప్యూటీ ఐవోఎస్ రామలింగయ్య, కృతి ఫౌండేషన్ ప్రతినిధి శ్రీలత, ప్రిన్సిపాల్ అనంత రాములు పాల్గొన్నారు.

- బంజారాహిల్స్, ఫిబ్రవరి 26

వర్క్‌షాప్ షురూ..

గండిపేట్‌లోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోని సీఎస్ఈ విభాగంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్‌పై వర్క్‌షాప్‌ను సోమవారం నిర్వహించారు. ఎడ్‌కల్ట్ సహకారంతో విద్యార్థుల కోసం వారం రోజుల పాటు ఈ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నారు. మొదటి రోజు కార్యక్రమాన్ని సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, అమెజాన్‌వెబ్ సర్వీసెస్ శిక్షణ

విద్యార్థులకు ఇవ్వడం ద్వారా భవిష్యత్తులో ఉద్యోగావకాశాలు మెరుగవుతాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానం మీద పట్టు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో 150 మంది విద్యార్థులు, ప్రొ. సీఆర్కే రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు. - మణికొండ, ఫిబ్రవరి 26

ప్రాజెక్ట్ వర్క్‌పై విద్యార్థులకు అవగాహన

ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంట్రప్రైజెస్ ఆధ్వర్యంలో లక్డీకాపూల్‌లోని ఐఐఎంసీ కళాశాల ఆడిటోరియంలో గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ప్రాజెక్టు వర్క్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కామర్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ చెన్నప్ప ప్రాజెక్టు వర్క్ చేసే విద్యార్థులకు ఈ సదస్సు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఐఐఎంసీ ప్రిన్సిపాల్ కూర రఘువీర్, ఐపీఈ డైరెక్టర్ శ్రీనివాస మూర్తి, కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ వంగపల్లి విశ్వనాథం పాల్గొన్నారు. - ఖైరతాబాద్, ఫిబ్రవరి 26

సాంకేతికంగా ముందడుగేయాలి

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుంటూ విద్యార్థులు తోటి వారి ఎదుగుదలకు దోహదపడాలని మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి సూచించారు. కళాశాలలో 'ఐటీ ప్రాజెక్టుల నమూన ఆవిష్కరణ – అనుసంధానం' పై మూడు రోజులుగా నిర్వహించిన సదస్సు సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సురేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఐటీ సంబంధిత స్టార్టప్‌ను రూపొందించి ఇతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సంయుక్త కార్యదర్శి సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి, ఐఐసీ కౌన్సిల్ కో ఆర్డినేటర్ ప్రతిభా భారతి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ నక్కీరన్, పి.రమేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

- మైలార్‌దేవపల్లి, ఫిబ్రవరి 26

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

మణికొండ, ఫిబ్రవరి 26: మహిళలు అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఆర్థికంగా బలోపేతం కావాలని నార్సింగి మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సయోధ్య హోమ్ ఫర్ ఉమెన్ ఇన్ నీడ్ స్వచ్ఛంద సంస్థ, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నార్సింగిలో వంటలపై 25 మంది మహిళలకు ఉచితంగా శిక్షణ అందించే కార్యక్రమం ప్రారంభమైంది. నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి ప్రవీణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. 30 రోజుల శిక్షణ తర్వాత శిక్షణ పొందిన మహిళలకు ఉపాధి కూడా కల్పించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శివా

రెడ్డి, ఆర్.కె.దుర్గేష్, విజయ్‌బాబు, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధులు రమేష్ చొప్పారా, భారతి కోడె, సయోధ్య కార్యదర్శి మృదుల వేముల పాటి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 26 : యూసుఫ్‌గూడ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సమస్యలను లిఖిత పూర్వకంగా ఇవ్వాలని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ రాణి, ఏఎంఓహెచ్ డాక్టర్ రవి, డిప్యూటీ ఈఈ శ్రీరాములు, ఎస్ఎస్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

బండ్లగూడ, ఫిబ్రవరి 26 : రాజేంద్రనగర్ మండల పరిధిలోని బుద్వేల్ కిష్టమ్మ గుట్ట వద్ద వెలిసిన అక్రమ నిర్మాణాలను రాజేంద్రనగర్ రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. తహసీల్దార్ రాములు తెలిపిన ప్రకారం, బుద్వేల్ సర్వే నం. 424లోని ప్రభుత్వస్థలంలో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా ఇండ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు తమకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీంతో సోమవారం ఉదయం నాలుగు అక్రమ నిర్మాణాలను గుర్తించి కూల్చివేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించాలని చూసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రాములు తెలిపారు.

ఐకమత్యంతో రాజ్యాధికారం సాధించుకోవాలి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 26: ఐకమత్యంతో హక్కులు సాధించుకొని రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని ఏసీబీ రిటైర్డ్ డైరెక్టర్ జనరల్, బీఎస్పీ ఏపీ రాష్ట్ర కోఆర్డినేటర్ జె. పూర్ణచంద్రా రావు పిలుపునిచ్చారు. బీసీ సమాజ్, మహాత్మా పూలే ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుమ్మర (శాలివాహన) రాజకీయ నాయకుల ఆత్మీయ సమ్మేళనం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పూర్ణచంద్రారావు మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో కులమే రాజ్యమేలుతుందని, ఈ నేపథ్యంలో ఒకే కులంగా ఉంటే ఏకాకులం కామన్నారు. దేశంలో బడుగులు, బహుజనులందరూ నూటికి 80 శాతం ఉన్నా ఐక్యత సాధించలేకపోతున్నారని అభిప్రాయపడ్డారు. రెండు, మూడు కులాలే ప్రజాస్వామ్యాన్ని తమ పట్టులో పెట్టుకున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల పాస్‌వర్డ్, పిన్ నంబర్లు ఉన్నత వర్గాల చేతుల్లో ఉన్నాయన్నారు. ఇక నుంచి తమ ఓటు బ్యాంకును తామే ఆపరేట్ చేసుకోవాలన్నారు. దేశం, రాష్ట్రంలో ప్రజాస్వామ్యం బాగుండాలంటే పరిపాలన బహుజనుల చేతుల్లోకి రావాలని, అప్పుడే వారు కలలు కన్న రాజ్యాధికారం సాకారమవుతుందన్నారు. తాను చదువుకొని డీజీ స్థాయికి ఎదిగానంటే మహాత్మా జ్యోతి రావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ల స్ఫూర్తియే కారణమన్నారు. అనంతరం పూర్ణచంద్రారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు సంగెం సూర్యారావు, మహాత్మా పూలే ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ శివ శంకర్, జాతీయ బీసీ కళా మండలి అధ్యక్షులు ఏ.రామలింగం, శ్రీశైలం శాలివాహన నిత్యాన్నదాన సత్రం అధ్యక్షులు బండారు భిక్షపతి, తెలంగాణ ఉద్యమకారులు, టీజేఎస్ రాష్ట్ర కార్యదర్శి మల్లెల రామనాథం పాల్గొన్నారు.

ఫిక్కీ లేడీస్ ఆధ్వర్యంలో..

ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం సోమాజిగూడలోని ది పార్క్ హోటల్‌లో జరిగిన సమావేశంలో సియాంట్ వ్యవస్థాపకులు బీవీఆర్ మోహన్ రెడ్డి, టీ హబ్ సీఈవో శ్రీనివాస్ రావు మహంకాళి, ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ వైస్ చైర్‌పర్సన్ ప్రతిభాతో కలిసి పాల్గొన్నారు.

- ఖైరతాబాద్, ఫిబ్రవరి 26

కనీస వసతులు కల్పించండి

బండ్లగూడ, ఫిబ్రవరి 26 : కాలనీలు ఏర్పడి ఏండ్లు గడుస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ కమిషనర్ శరత్‌చంద్రను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒకటో డివిజన్ పరిధిలోని తిరుమల హిల్స్, యాదయ్య నగర్, ఇండస్ వ్యాలీ, హిమగిరి నగర్ తదితర కాలనీలో రోడ్లు, వీధిదీపాలు లేక పోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే ఆయా ప్రాంతాల్లో సీసీ రోడ్డుతో పాటు వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కమిషనర్ శరత్ చంద్రను కోరారు.



కమిషనర్ శరత్‌చంద్రకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ చంద్రశేఖర్

ఇందుకు స్పందించిన శరత్ చంద్ర త్వరలో కాలనీలో పర్యటించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

ఉత్సాహంగా రోడ్ షో

బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సోమవారం ఖైరతాబాద్ నియోజకవర్గంలో రోడ్ షో నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని పలు కాలనీల్లో కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, గౌతమ్‌రావుల రోడ్ షో కొనసాగింది. స్థానిక మహిళలు నృత్యాలు, డప్పుల దరువుతో సందడి చేశా. - బంజారాహిల్స్, ఫిబ్రవరి 26

వస్త్ర ప్రదర్శన

క్రాఫ్ట్స్ అండ్ వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతృత్వంలో వస్త్ర ప్రదర్శన ఆకర్షిస్తుందని వర్ధమాని నటి రూపాచౌదరి అన్నారు. శ్రీనగర్ కాలనీ సత్యసాయి నిగమాగమంలో గుజరాత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటైన జాతీయ చేనేత పట్టు ఉత్పత్తుల వస్త్ర ప్రదర్శనను రూపా చౌదరి సోమవారం ప్రారంభించారు. నిర్వాహకులు జయేష్ మాట్లాడుతూ.. మార్చి 3 వరకు ప్రదర్శన ఉంటుందని, 14 నగరాల నుంచి సిల్క్ హ్యాండ్లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్, 50 వేల రకాల వస్త్ర ఉత్పత్తులను అందుబాటులో ఉంచామన్నారు.

- వెంగళరావునగర్, ఫిబ్రవరి 26

శాస్త్ర రంగంపై అవగాహనకు ఆస్ట్రేలియా సిద్ధం

ఖైరతాబాద్, ఫిబ్రవరి 26 : శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విజ్ఞానాన్ని పంచుకోవడానికి ఆస్ట్రేలియా సిద్ధంగా ఉన్నదని ఆస్ట్రేలియా ఆరోగ్యశాఖ మంత్రి అంబర్ జేడ్ సాండర్సన్ అన్నారు. మంత్రి సోమవారం నిమ్స్‌ను సందర్శించారు. ఆమెకు డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప స్వాగతం పలికారు. వివిధ విభాగాలను సందర్శించి, స్థానికంగా అందుతున్న వైద్య సేవలను గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. నిమ్స్ ఆడిటోరియంలో జరిగిన శిబిరంలో మాట్లాడారు. ఆస్ట్రేలియా, భారత్‌కు భౌగోళికంగా తేడాలున్నా సారూప్యత ఉందన్నారు. నర్సింగ్ వృత్తిని రెండు దేశాలూ గౌరవిస్తాయన్నారు. భారత్, తెలంగాణ ప్రభుత్వ చొరవతో నిబంధనలను సరళతరం చేయనున్నట్లు తెలిపారు. వృత్తిపరమైన శిక్షణ, అధ్యయనాలలో భారత్‌తో భాగస్వామ్యం కావడానికి ఆస్ట్రేలియా సిద్ధంగా ఉందన్నారు. భారత నర్సింగ్ విద్యార్థులు తమ ఉన్నత విద్య స్పెషలైజేషన్ కోసం ఆస్ట్రేలియాలో ర్సింగ్ విశ్వవిద్యాలయాల్లో చేరవచ్చని తెలిపారు. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప వైద్య చికిత్స విధానాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో నిమ్స్ డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్, ఆస్ట్రేలియా ప్రభుత్వ ప్రతినిధులు స్టేసీ హెర్న్, జోడి సౌత్, పార్లమెంట్ సెక్రటరీ డాక్టర్ జగదీశ్ కృష్ణన్, మేనేజింగ్ డైరెక్టర్ పెద్ది రామచంద్రన్, చీఫ్ అల్లైడ్ ఆఫీసర్ జెన్నీఫర్, చారెర్లస్, ప్రొఫెసర్ రతన్, డాక్టర్ భాస్కర్, టీనా, పారామెడికల్, నర్సింగ్, ఫీజియోథెరపి కళాశాలల ప్రిన్సిపాళ్లు శీరందాస్ శ్రీనివాసులు, ద్రాక్షాయిని, డాక్టర్ శ్రావణ్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారెడ్డి, ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ సదాశివుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యులను ఉద్దేశించి మాట్లాడుతున్న అంబర్ జేడ్ సాండర్సన్

ల్యాప్‌టాప్ మాయం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 26: హాస్టల్ గదిలో నుంచి ల్యాప్‌టాప్ మాయమైన ఘటన ఫిలింనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎమ్మెల్యే కాలనీ లోటస్ పాండ్ సమీపంలో కైగో హాస్టల్‌లో నివాసం ఉండే తరుణ్ పాండే ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల 24న హాస్టల్ నుంచి బయటకు వెళ్లే క్రమంలో ల్యాప్‌టాప్‌ను బ్యాగులో పెట్టి వెళ్లాడు. రెండు గంటల తర్వాత వచ్చి చూడగా ల్యాప్‌టాప్ కనిపించలేదు. హాస్టల్‌లోని వ్యక్తులను అడిగినా ప్రయోజనం లేక పోవడంతో సోమవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

చెత్త తరలింపులో నిర్లక్ష్యంపై ఫిర్యాదులు



శానిటేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 26: జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది నిర్లక్ష్యంపై ఇటీవల పౌరుల నుంచి ఫిర్యాదులు పెరిగాయని, చెత్త తరలింపులో అలసత్వం మానుకోవాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ సూచించారు. ఫిలింనగర్‌లోని తన కార్యాలయంలో జీహెచ్ఎంసీ సర్కిల్-18 ఏఎంవోహెచ్ డా.రజనీకాంత్, శానిటేషన్ సూపర్‌వైజర్లతో కార్పొరేటర్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రోడ్లను శుభ్రం చేయడం లేదని, రోడ్ల పక్కన గుట్టలుగా చెత్త పేరుకుపోతున్నా పట్టించుకోవడం లేదని కాలనీలు, బస్తీల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని కార్పొరేటర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్త తరలింపు వాహనాలు సరిపోయినన్ని లేవని, సిబ్బంది కొరత ఉందని శానిటేషన్ విభాగం అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని త్వరలో జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఎస్ఎఫ్ఏల పనితీరుపై విజిలెన్స్ విభాగం నిఘా పెట్టిందని, పద్ధతి మార్చుకోకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు.

అత్యంత శక్తిమంతం.. స్త్రీ శక్తి

మహిళలతో కలిసి ముచ్చటిస్తున్న అపోలో హాస్పిటల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి

మణికొండ, ఫిబ్రవరి 26: స్త్రీ శక్తి అన్ని శక్తులలో అత్యంత శక్తిమంతమైనదని అపోలో హాస్పిటల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి తెలిపారు. సన్ సిటీలోని కేకే కన్వెన్షన్‌లో సోమవారం మహిళా శక్తి సమ్మేళనం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. మహిళలు నాయకత్వం వహించే చోట ఫలితాలు స్థిరంగా, సానుకూలంగా ఉంటాయన్నారు. మహిళలు ఉల్లాసంగా ఉంటే, ఆ ఉత్సాహం కుటుంబం అంతా ఉంటుందన్నారు. ఆ శ్రేయస్సు, వివేకం భౌతిక సంపదను మించిన సంపద అవుతుందన్నారు. గతేడాది భారతదేశం జీ20 సమావేశాలకు ఆతిథ్యం ఇచ్చిందన్నారు. జీ 20 అతి ముఖ్యమైన అంశమని, జీ 20 ఎంపవర్ అని, ఇది మహిళలపై దృష్టి సారించిందన్నారు. జీ20 దేశాలలో మహిళా సాధికారత సమూహాలు ఉన్నాయని తెలిపారు. మహిళా శ్రామిక శక్తిని మెరుగుపరచడం దీని ప్రధాన లక్ష్యమన్నారు. జీ20 సాధికారతకు చైర్‌పర్సన్‌గా ఉన్నానరి ఆమె పేర్కొన్నారు. పురుషులు, మహిళలు చేసే ఒకే పనికి కూడా స్త్రీకి తక్కువ వేతనం లభిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివక్షతను అధిగమించడానికి మహిళలకు సమాన అవకాశాలు, పని వాతావరణం, మద్దతు, ప్రోత్సాహం అవరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటమి అనేది.. ఓ గుణపాఠం

కార్యక్రమంలో పాల్గొన్న రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 26: ఓటమి అనేది మనకు గుణపాఠాలు నేర్పుతున్నదని రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం క్రీడా ప్రాంగణంలో సోమవారం ఉద్యోగుల క్రీడల విభాగాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కబడ్డీ, ఖోఖో, క్రికెట్ ఆటలు ఆడే వారమని, తిండి కూడా మర్చిపోయేవారమన్నారు. ఐనా చురుకుగా ఉండేవాళ్లమని , కానీ ఈ వయస్సులో వేళకు భోజనం చేయడం, వెంటనే పనుల ఒత్తిడిలో లీనమవడం వల్ల మానసిక ఒత్తిడికి గురై, వివిధ రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు.ఎన్ని పనులున్నా ఉదయం వేళ విధిగా వాకింగ్ చేయాలని, అప్పుడప్పుడు ఆటలు ఆడాలని ఆయన సూచించారు. కళాశాల డీన్ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో డా. బి. జమునా రాణి, రీసెర్చ్ డైరెక్టర్ డా. రఘురామిరెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

పీవీఎన్నార్ ఎక్స్‌ప్రెస్ వేపై కారు బోల్తా

బండ్లగూడ, ఫిబ్రవరి 26 : ఓ వాహనదారుడు డివైడర్‌ను ఢీకొన్న ఘటన రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన ప్రకారం..సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నం.296 వద్ద ఓ యువకుడు అతివేగంతో కారును నిర్లక్ష్యంగా నడపడంతో డివైడర్‌ను ఢీకొట్టి పల్టీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న యువకుడు భద్రంగా ఉన్నట్లు వారు తెలిపారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారును అక్కడి నుంచి తరలించి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా తీసుకున్నారు.

'పరారైన టిల్లు దొరికిండు'

ఖైరతాబాద్, ఫిబ్రవరి 26: పంజాగుట్ట పీఎస్ నుంచి పారిపోయిన దొంగ దొరికాడు. 22న నిమ్స్ వద్ద నిర్మాణ వ్యర్థాలను దొంగలించేందుకు వచ్చిన టిల్లు అలియాస్ శివను స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. విచారణ నిర్వహిస్తున్న క్రమంలో వాష్ రూమ్‌కు పోయి వస్తానంటూ చెప్పి పోలీసుల కండ్లుకప్పి పారిపోయాడు. నాటి నుంచి పోలీసులు అతన్ని వెతుకుతున్నారు. ఎట్ట కేలకు సోమవారం రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్ వద్ద పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

ద్విచక్ర వాహనంలో గంజాయి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 26 : ద్విచక్ర వాహనంలో గంజాయిని తరలిస్తూ ఇద్దరు వ్యక్తులు పోలీసులకు చిక్కారు. పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. సీఐ శోభన్ తెలిపిన ప్రకారం, పంజాగుట్టలో వాహనాల తనిఖీలు చేపడుతుండగా, అనుమానాస్పందంగా వెళ్తున్న ఓ యాక్టివాను పోలీసులు ఆపారు. వెంటనే అందులోని డిక్కీలో తనిఖీ చేయగా 13 గ్రాముల రెండు గంజాయి ప్యాకెట్లు లభించాయి. పట్టుబడ్డ నిందితులిద్దరిని విచారించగా, చంచల్‌గూడకు చెందిన మహ్మద్ అబ్దుల్లా , సయ్యద్ ముదస్సీర్ గా గుర్తించారు. ధూల్‌పేట నుంచి సొంతంగా సేవించేందుకు వీటిని తీసుకువచ్చినట్లు నిందితులు ఒప్పుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

సమస్యలు పరిష్కరించాలి

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 26: పేద